# దారిలో దొరికిన ప్రేమలేఖలు

– ???



*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

*- 1 -*

***చిన్నారి దేవకన్యా!***

**ఎన్నో చెప్పాలనుకుంటూనే** ఎన్నో ఎన్నో మర్చిపోతాను. ఎన్నో ఖబుర్లు నీకోసం మనస్సులో సిద్ధం చేసుకుని, నిన్ను చూసిన వెంటనే అవన్నీ మర్చిపోతాను. నీవు ఎదురుగా కనిపిస్తే చెప్పాలనుకునే మాటలకంటే, కోటికోటి రెట్లు నిన్ను చూడనప్పుడు నా మనస్సులో నీ రూపాన్ని ఊహించుకుంటూ మాట్లాడుతూ ఉంటాను... చూసేవాళ్ళంతా నాకు 'మౌనంగా ఉండటం అంటే ఎక్కువ యిష్టం' అంటారు. వాళ్ళకి మాత్రం ఏం తెలుస్తుంది? నేనెప్పుడూ మౌనంగా ఉండననీ ఎప్పుడూ నీతో మనస్సులో మాట్లాడుతూనే ఉంటాననీ.. ఆ మాటలు నీకు మాత్రం వినబడుతూనే ఉంటాయి కదూ!

ఎంతపనిలో ఉన్నా నీవు గుర్తుకు వచ్చేసరికి మాత్రం ఆకాశంలో జాబిలీ వెన్నెలా విరిసినట్లు నా మనస్సులో నవ్వే నీ కళ్ళూ, పెదవులు కనిపిస్తాయి. ఆ తరువాత మెరిసే కోటికోటి తారల్లాగా నీ కదలికల అందాలూ, అంతెందుకూ, నీ చిట్టి చిట్టి కాలివేళ్ళ కొనగోటి కాంతులు కూడా మనస్సులో దర్శనమిస్తాయంటే నమ్ము...! ఎఱ్ఱని పట్టుచీర కట్టుకుని పూలబుట్టతో నువ్వు గుడికి వెళ్ళావు గుర్తుందా? ఆ పట్టుచీరె రెపరెపలూ ఆనాటి చిరుగాలికి ఊగిన నీ ముంగురులు కూడా మనస్సులో మళ్ళీ మళ్ళీ ప్రతిఫలిస్తూనే ఉంటాయి. ఎంత అందమైన రోజు అది.!!

ఆనాటి సూర్యకాంతి బంగారుమయమై నీ ముఖాన్ని చేరి నీ వొంటి కాంతితో స్నేహం చేసింది తెలుసా! చల్లటి చిరుగాలి నిన్ను తాకి నీ వొంటి పరిమళాన్ని తనలో నింపుకుంది. అంతెందుకు నీవు ఠీవిగా, దయగా మంచి మనసుగల మహారాణీలా, సవ్వడి చెయ్యని మెత్తని పాదాలతో గుడి మెట్లు ఎక్కుతుంటే ఎన్ని పక్షులు ఆనందంగా ఆకాశంలో చిత్రికలు కొడుతూ కమ్మని కంఠంతో నిన్నాహ్వానించాయో తెలుసా! నువ్వు మందహాసంతో పూలచెట్లను పరికించి చూశావు.

ఆనాటి నీ దరహాసం ఎంత అద్భుతం.!! వెన్నెల మీగడై నీ పెదవి అంచున నిలిచిందా అనిపించింది.

సర్వస్వమా! ఇదంతా నిన్ను పొగడటానికి వ్రాయడంలేదు.! నిన్ను పొగడగలిగేంత భావమూ, భాషా నాకెక్కడివి? పోనీ ఏదో మాటల్లోనో అక్షరాల్లోనో ఇముడ్చుదామని ప్రయత్నించినా, ఏ ఉపమానాలని వెదుక్కోనూ? సౌందర్యాన్నంతా ఒకచోట పోగుచేసి, పరిమళాన్నంతా అందులో రంగరించి, వెన్నెల తరగల్నీ, పూవుల రంగుల్నీ, మహోన్నత సానువుల గంభీరతనీ, సముద్రపు నిశ్చలతనీ దరహాసపు కెరటాలనీ, పవిత్ర నదీజలాల తియ్యదనాన్నీ, ప్రవాహపు ఒంపుసొంపుల్నీ నింపి ఓ అత్యద్భుత మూర్తిని తయారు చేసినా, ఆ మూర్తి నీ ముందు వెలవెలా నిట్టూర్చదూ?

ఇదంతా చదివి కనుబొమలు ముడివేసి.. "ఇదిగో కవీ! నీకు ఎన్నిసార్లు చెప్పానూ పొగడవద్దనీ?" అంటావేమో కదూ!

నాకేం తెలుసూ? నిన్ను చూసిన క్షణాల్లో నన్ను నేను మర్చిపోతాను. ఓ మహోత్సాహ మహానంద కెరటం నన్ను ఆకాశానికి ఎత్తివేస్తుంది.! మౌనం నా భాషగా పెదాలనాశ్రయిస్తుంది. నీ కదలిక మరుగు కాగానే ఓ బలిష్టమైన నిట్టూర్పు నాశికల నించి జ్వాలలు

వెలువరిస్తూ బయటికొస్తుంది. నిరుత్సాహపు ఋతువు ఱెక్కలతో నన్ను చుట్టివేసి నీ వెనుకే ఆర్తిగా చూసే నా కంటి తటాకాల్నించి కన్నీటిని ప్రవహింపచేస్తుంది. మిగిలింది నేనూ - నా మౌనం.!!

ఇదంతా చదువుకుని నీవు వ్యాకుల పడతావేమో.! ఒద్దు నా బంగారు కన్యా.... నేను ఇదంతా వ్రాసేది కేవలం నా పిరికి గుండెను నీ పాదాల వద్ద పదిలపరచడానికి మాత్రమే.! ఇందులో కొంత అహంభావమూ ధ్వనించవచ్చు.. నిన్ను చూడగానే మూగబోయే బలహీనుడ్ని, నిన్ను మనస్సులోనే దాచుకున్నాననుకునే అహంభావిని. నవ్వుకుంటావుకదూ! నువ్వు నవ్వితే నీ పెదాలమీద వెన్నెల నాట్యాలు చేస్తుంది..! కొంచెం చిన్నవై నీకన్నులు దయాకిరణాల్ని కురిపిస్తాయి..! నీ దృక్కులు ప్రవహించే నా అక్షరాలు అదృష్టం ఏమని చెప్పను! నీ చూపులు వాటిని స్పృశించి అమృతమయమూ, ఆనందమయమూ చేస్తాయి...

మరి నేనో! కేవలం అక్షర శిల్పిని! పోనీలే.. నీ చూపుల వెన్నెలలో అవైనా ప్రాణం పోసుకుంటాయనే, నా తృప్తి.! ఇక ఉండనా? చాలా విసిగించాను కదూ.! నాది ఉత్తి మట్టి బుర్ర.!

సాహిత్యం ఏ మాత్రం తెలీదు.! యీ పిచ్చి మాటల్నే అర్థం చేసుకుంటావు కదూ....

నీ

-X-

(వచ్చేనెల మరో ప్రేమలేఖ)

Post your comments